పత్తి విక్రయాల్లో సందేహాలా?

డీఎంవో గజానంద్‌తో ఈనాడు ఫోన్-ఇన్

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 25 నుంచి పత్తి క్రయవిక్రయాలు ప్రారంభం కానున్నాయి. మార్కెట్‌లో మద్దతు ధర కంటే తక్కువ ధర ఉంది. సీసీఐ కొనుగోళ్లపైనే రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేసే సీసీఐ అనేక నిబంధనలు పెట్టింది. తేమ శాతం ఆధారంగానే ధరను చెల్లిస్తారు. పంట సమగ్ర సర్వేలో పేర్లు ఉన్న రైతుల నుంచి మాత్రమే పత్తిని కొనుగోలు చేస్తారు. రైతులు ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేందుకు మార్కెట్ శాఖ ప్రవేశపెట్టిన వాట్సాప్‌లో సమాచారం సరిగా రావడం లేదు. మార్కెట్‌లో సౌకర్యాలు, డబ్బుల చెల్లింపులు, తూకంలో తేడాలు, తేమ శాతం నిర్ధారణ.. ఇలా అనేక సందేహాలు రైతులను వెంటాడుతున్నాయి. నివృత్తి చేసుకునేందుకు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి గజానంద్‌తో 'ఈనాడు' బుధవారం ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

సమయం : బుధవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు **80085 73582**

నిధులు రాబట్టి.. విద్యాభివృద్ధికి కృషి చేస్తాం

తాంసి, న్యూస్‌టుడే : తాంసి గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో రూ.75 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను మంగళవారం ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పాఠశాలల్లో వసతుల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాబట్టి.. విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. గ్రామస్థులు, ఉపాధ్యాయులు వారిని సన్మానించారు. నాయకులు రాజు, అరుణ్‌కుమార్, కృష్ణ, వినోద్‌రెడ్డి, మహేందర్, రామన్నయాదవ్, గోవర్ధన్‌రెడ్డి, నాగరెడ్డి, తిరుమలగౌడ్, గంగయ్య, రమణ, రజనీకాంత్‌రెడ్డి, భగవాండ్లు, భూమన్న, అశోక్, రమణ, చందర్‌రెడ్డి తదితరులున్నారు.


పనులను ప్రారంభిస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

రుచులు ఆస్వాదించేలా.. లాభాలు ఆర్జించేలా..

● ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ల ద్వారా మహిళలకు ఉపాధి



న్యూస్‌టుడే, దెహగాం, నస్పూర్ : నోరూరించే మిఠాయిలు.. ఘుమఘుమలాడే పిండి వంటకాలు.. సంప్రదాయ రుచులతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో క్యాంటిన్లు ఆహ్వానం పలుకుతున్నాయి. మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారిని ఆర్థికాభివృద్ధి వైపు ప్రోత్సహించేలా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. నిర్వహణ సామర్థ్యం ఉన్న స్వయం సహాయక సంఘాలను గుర్తించి శిక్షణ ఇచ్చి వీటిని ఏర్పాటు చేస్తున్నారు. రూ.8 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు దశల వారీగా రుణాలు మంజూరు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, మంచిర్యాల కలెక్టరేట్ ప్రాంగణాల్లో, లక్సెట్టిపేటలోని ఐకేపీ కార్యాలయం ఆవరణలో ఇప్పటికే స్వయం సహాయ సంఘాల ఆధ్వర్యంలో క్యాంటిన్లు వెలిశాయి.

రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటుకు కార్యాచరణ

ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక, పర్యాటక ప్రాంతాలు, ఆలయాలు, మార్కెట్లు, ఆర్టీసీ బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించారు. అందుబాటులో ఉండే ధరలకు నాణ్యమైన ఆహార పదార్థాలు లభిస్తాయి. మహిళా సంఘం సభ్యులతో ఆహార పదార్థాలు, పిండి వంటలు, మిఠాయిలు, పచ్చళ్లు, పండ్ల రసాలు, సంప్రదాయ వంటకాలు తయారు చేయించి విక్రయాలు చేపడుతున్నారు.

ప్రతిపాదిత ప్రాంతాలివే..

- ఆదిలాబాద్: కోర్టు ఆవరణ, మున్సిపల్ కార్యాలయం, కలెక్టరేట్
- నిర్మల్ : ఏరియా ఆసుపత్రి, మెడికల్ కాలేజీ, మాతా శిశు ఆసుపత్రి
- ఖానాపూర్: తహసీల్దారు కార్యాలయం, ఆసుపత్రి ఆవరణ, మున్సిపల్ కార్యాలయం
- మంచిర్యాల: మున్సిపల్ కార్యాలయం, మాతా శిశు ఆసుపత్రి, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం, బస్టాండ్
- భైంసా : ఏరియా ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం
- కుమురంభీం : ఈఎస్ఐ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం
- బెల్లంపల్లి : ఏరియా ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం

☛ మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో ఆగస్టు 15న ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను స్నేహలత గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించారు. చాయ్, అల్పాహారం, నీళ్ల సీసాలు, శీతల పానీయాలు, ఇతర తినుబండారాలను, ఆహార పదార్థాలను నిర్వాహకులు అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో నిర్వాహకులకు ఉపాధితోపాటు ఇక్కడికి వచ్చే వారికి అందుబాటులో రుచికరమైన నాణ్యమైన ఆహార పదార్థాలు లభిస్తుండటంతో సమయం ఆదా అవుతోంది.


క్యాంటిన్‌లో అల్పాహారం, భోజనాలు చేస్తున్న వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు, కలెక్టరేట్ కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది

ఉమ్మడి జిల్లాలో 20కి పైగా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20కి పైగా మహిళా శక్తి క్యాంటిన్ల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించారు. మంచిర్యాల జిల్లాలోని లక్సెట్టిపేట, నస్పూర్ మినహా మిగతా ఎక్కడా వీటి ఏర్పాటు జరగలేదు.


మంచిర్యాల కలెక్టరేట్ కార్యాలయంలో గ్రామైక్య సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్



అద్దె భారం తప్పింది

- గురిజాల లత, స్వయం సహాయక సభ్యురాలు, హాజీపూర్

నేను మరో ముగ్గురు సభ్యులు కలిసి కలెక్టరేట్‌లో క్యాంటిన్‌ను ఏర్పాటు చేశాం. వీటి ఏర్పాటుకు ఉచితంగా గది ఇవ్వడంతో అద్దె భారం తప్పింది. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు క్యాంటిన్ నిర్వహిస్తున్నాం. ఉదయం అల్పాహారం, పాలు, కాఫీ, టీలతో పాటు మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టీ, కాఫీ ఇతర స్నాక్స్ అందుబాటులో ఉంచాం.

ప్రభుత్వ పథకాల అమలుపై అధ్యయనం

తాంసి, న్యూస్‌టుడే : తాంసి మండలం పొన్నారిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, అమలు, వాటి సత్ఫలితాలపై సివిల్ సర్వీసు శిక్షణ అధికారులు మంగళవారం ఆరా తీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులస్థుల జీవన విధానం, ఆర్థికాభివృద్ధి, ప్రభుత్వాల తోడ్పాటు, సమస్యలను పరిగణనలోకి తీసుకున్నారు. బండల్‌నాగపూర్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్మించిన రైతువేదికను, రైతులు పండిస్తున్న పత్తిపంటను పరిశీలించారు. తాంసి పీహెచ్‌సీని సందర్శించి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ఏఓ రవీందర్, కార్యదర్శి గంగన్న తదితరులున్నారు.


పొన్నారిలో సంక్షేమ పథకాల అమలుతీరును తెలుసుకుంటున్న సివిల్ సర్వీస్ శిక్షణ అధికారులు

పెండల్‌వాడలో శిక్షణ అధికారుల పర్యటన

జైనథ్, న్యూస్‌టుడే : జైనథ్ మండలం పెండల్‌వాడ గ్రామంలోని ఆత్మలింగ అభయాంజనేయ స్వామిని అఖిల భారత సర్వీసు శిక్షణ అధికారులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఖమ్రుద్దీన్‌ఖాన్(ఐఆర్ఎస్), డేవిడ్ వినయ్‌కాంత్‌రావు చనాబ్(ఐఎఫ్ఎస్), పవన్ జ్యోత్ కౌర్ (ఐపీఓఎస్), సిమ్రాన్(ఐఎస్ఎస్), మోహిత్ రావత్ (ఐపీఎస్)లు శిక్షణ నిమిత్తం వచ్చారు. వారికి గ్రామస్థులు, అధికారులు స్వాగతం పలికి సన్మానించారు. మంగళవారం గ్రామంలో పర్యటించారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో వెంకట్‌రాజు ఉన్నారు.


ఎండల్‌వాడ : శిక్షణ అధికారులను సన్మానిస్తున్న గ్రామస్థులు

ఏత్మాసూర్ నైవేద్యానికి దంపుడు బియ్యం

దీపావళి వచ్చిందంటే ఆదివాసీలు దండారీ ఉత్సవాలు నిర్వహిస్తారు. వారం రోజుల ముందు నుంచి ఏత్మాసూర్ దేవుడి నైవేద్యానికి దంపుడు బియ్యం సిద్ధం చేస్తారు. దీపావళి ముందు ఖరీఫ్ సీజన్‌లో చేతికొచ్చే ఎర్ర వరిని సాగు చేస్తారు. సేకరించిన వడ్లను మిల్లుకు తీసుకెళ్లకుండా ఇంటికి తీసుకొస్తారు. వడ్లలో మట్టి, రాళ్లు రాకుండా గుడ్డతో అద్ది రోలులో వడ్లను దంచి బియ్యంగా మారుస్తారు. వాటిని ఏత్మాసూర్, లక్ష్మీ దేవతకు నైవేద్యంగా సమర్పిస్తామని చింతగూడకు చెందిన మోతుబాయి తెలిపారు. ఉపవాసం ఉండి ఈ క్రతువును భక్తితో పూర్తి చేస్తామన్నారు. మంగళవారం నార్నూర్ మండలంలోని చింతగూడలో దంపుడు బియ్యం కోసం వడ్లను అద్దుతుండగా 'న్యూస్‌టుడే'కు కనిపించారు. - న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి


చింతగూడలో దండారీ వేడుకలకు బియ్యం సిద్ధం చేస్తున్న తొడసం మోతుబాయి

బడా బాబులకే.. బల్దియా పనులు

● రూ.10.50 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధుల తీరిది..

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం : ఆదిలాబాద్ మున్సిపాల్టీలో బకాయిలు పేరుకుపోయి బడా గుత్తేదారులు చాలాచోట్ల పనులు మధ్యలోనే వదిలేశారు. దీన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఇటీవల మంజూరైన తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(టీయూఎఫ్ఐడీసీ) నిధుల్లో మళ్లీ పెద్ద గుత్తేదారులకు అనుకూలంగానే పనులు ప్రతిపాదించడం విమర్శలకు తావిస్తోంది. మొత్తం రూ.10.50 కోట్ల విలువతో చేపట్టే 19 పనులను కేవలం రెండు ప్యాకేజీలుగా మలిచి ఆమోదం కోసం ఉన్నతాధికారులకు పంపించారు.

మౌలిక వసతుల కల్పనకు రుణ ప్రాతిపదికన విడుదలయ్యే టీయూఎఫ్ఐడీసీ నిధులకు సంబంధించి పనులకు గత ప్రభుత్వ హయాంలోనే మంజూరు లభించింది. మొత్తం రూ.42 కోట్లకుపైగా ఉన్న పనుల్లో కొత్త ప్రభుత్వం రాగానే మార్పులు చేర్పులు జరిగాయి. కేవలం రూ.10.50 కోట్ల వరకు పనులకు మాత్రం ప్రస్తుతానికి మంజూరు లభించింది. ఇందులో ఈ ఏడాది ఆగస్టు 7న 5.40 కోట్లతో 6 పనులకు మంజూరు ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతరం అక్టోబరు 9న ఇదే పథకం కింద రూ.5.10 కోట్లతో 13 పనులతో ఉత్తర్వులు విడుదలయ్యాయి.


ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం

నిబంధనలు ఏం చెబుతున్నాయి..

మంజూరైన 19 పనుల్లో 3 పనులు మాత్రమే రూ.కోటిపైన ఉన్నాయి. మిగతా 16 పనులు రూ.50 లక్షలు, అంతకంటే తక్కువ విలువైనవి ఉన్నాయి. వాస్తవానికి క్లాస్-5 లైసెన్స్ ఉన్న చిన్న గుత్తేదారులు రూ.50 లక్షల వరకు పని చేసేందుకు వీలుంటుంది. రూ.2 కోట్ల వరకు క్లాస్-4, రూ.4 కోట్ల వరకు క్లాస్-3, రూ.6 కోట్ల వరకు క్లాస్-2 గుత్తేదారులు పనులు చేసేలా నిబంధనలున్నాయి. పెద్ద పనులు చేపట్టేందుకు క్లాస్-1, స్పెషల్‌క్లాస్ గుత్తేదారులకు అవకాశం ఉంది. బడా గుత్తేదారులే ఇక్కడ రంగంలోకి దిగుతున్నారు. ఆదిలాబాద్ మున్సిపాల్టీలో క్లాస్-5 లైసెన్స్ ఉన్న గుత్తేదారులు 30 మందికిపైగానే పనులు చేపడుతున్నారు. కొంతకాలంగా ప్యాకేజీలు చేసి పెద్ద పనిగా మార్చి టెండర్లు పిలవడంతో పోటీ తక్కువగా ఉండి, బల్దియా ఆదాయానికి గండిపడుతోంది. ఇప్పటికే బడా గుత్తేదారులకు మంజూరైన వాటిలో రూ.7కోట్లతో చేపట్టే సమీకృత మార్కెట్ భవనం, రూ.5 కోట్లతో చేపట్టే మినీ ఆడిటోరియంతోపాటు మొత్తం రూ.30 కోట్లకుపైగానే పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. మళ్లీ వారికే ఇస్తే ఎలా అనే విమర్శలొస్తున్నాయి. రూ.50 లక్షల వరకు విలువైన పనులు మున్సిపాల్టీలోనే సాంకేతిక ఆమోదం తెలిపి టెండర్లు పిలిచే అవకాశం ఉంది. తాజాగా మంజూరైన టీయూఎఫ్ఐడీసీ నిధుల్లో మొదట వచ్చిన రూ.5.40 కోట్లతో 6 పనులను ఒక ప్యాకేజీగా, మరోమారు మంజూరైన రూ.5.10 కోట్లతో 13 పనులు మరో ప్యాకేజీగా మలిచి హైదరాబాద్‌కు పంపించారు. ఇంకా ఆమోదం రావాల్సి ఉంది.

పనులు తొందరగా కావాలని..

తిరుపతి, ఇన్‌ఛార్జి ఈఈ

అభివృద్ధి పనులను వీలైనంత తొందరగా పూర్తి కావాలనే ఉద్దేశంతో ప్యాకేజీలుగా రూపొందించాం. రూ.2 కోట్ల వరకు ఒకే ప్యాకేజీ ఉండొచ్చనే సూచనలున్నాయి. అందుకే రెండు ప్యాకేజీలుగా తయారు చేసి ఆమోదం కోసం పంపించాం.

గొడవపడ్డాయి.. కలిసిపోయాయి!

ఆదిలాబాద్ గ్రామీణ మండలం తంతోలి సమీపంలోని ఓ పొలంలో రెండు కొంగలు తీవ్రంగా అరుస్తూ గొడవపడ్డాయి. ఒక దాన్ని మరొకటి ముక్కుతో పొడుచుకున్నాయి. కొద్ది సేపటికి ఒక కొంగ పొలంలోకి ఒరిగిపోగా మరో కొంగ దాని వీపు మీద ఎక్కి ఇలా నృత్యం చేసింది. అక్కడ పొలంలో పని చేస్తున్న రైతులు ఈ కొంగల ఆటను చూసి మురిసిపోయారు.

- ఈనాడు, ఆదిలాబాద్



నాగోబా జాతరలోపు పనులు పూర్తయ్యేనా?

న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి : ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబా జాతర ఉత్సవాలు మరో మూడు నెలల్లో ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో చేపట్టే అభివృద్ధి పనులు అప్పట్లోగా పూర్తయ్యేట్లు లేవు. భారాస ప్రభుత్వం నాగోబా ఆలయానికి నాలుగు వైపులా గోపురాల నిర్మాణంతో పాటు ఆలయం చుట్టు ప్రత్యేకంగా గదుల ఏర్పాటు కోసం రూ.6.50 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులను చేపట్టిన ఖమ్మం జిల్లాకు చెందిన గుత్తేదారు పనులు తీసుకుని మూడు గోపురాల పనులను పూర్తి చేశారు. చుట్టూ ప్రాకారం గదులను నిర్మించారు. నాగోబా మహాపూజ రోజున గోవాడ నుంచి ఆలయానికి తీసుకొచ్చే ప్రధాన దారి గోపురం పనులను నిలిపి వేశారు. రంగులు సైతం వేయలేదు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం రూ.కోటి నిధులు మంజూరు చేసింది. నేటికీ అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదు.


మూడేళ్లుగా ప్రారంభం కాని నాగోబా ఆలయ గోపురం పనులు

ఇప్పుడే చేయాలి..

- మెస్రం వెంకట్‌రావు, ఆలయ పీఠాధిపతి

నాగోబా జాతర ప్రారంభానికి నెల రోజుల ముందు పనులను ప్రారంభిస్తే నాసిరకంగా ఉంటాయి. ఇప్పుడే పనులు ప్రారంభించాలి. గుత్తేదారు రావడం లేదు. సీఎం రేవంత్‌రెడ్డి మంజూరు చేసిన రూ.కోటితో వసతి కోసం భవనం నిర్మించాలి.

వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం

- సతీష్ ఏఈఈ, గిరిజన సంక్షేమ శాఖ

నాగోబా జాతరలో చేపట్టే అభివృద్ధి పనులను వారం రోజుల్లో ప్రారంభిస్తాం. గోపురం పనులను వచ్చే నెలలో మొదలు పెడతాం. గుత్తేదారుకు పనులు ప్రారంభించాలని సూచించాం. వర్షాల వల్ల ఆలస్యమైంది.

ఉన్నత లక్ష్యం వైపు అడుగులు వేయాలి

సిరికొండ, న్యూస్‌టుడే : విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత లక్ష్యం వైపు అడుగుల వేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం సిరికొండలోని జిల్లా పరిషత్ సెకండరీ ఉన్నత పాఠశాలను, అంతకు ముందు సుంకిడిలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం అందజేసి వారి ఎదుగుదలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చూడాలని, పోషకులతో మాట్లాడాలన్నారు. సిరికొండ పాఠశాలలో ఇటీవల తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలతో మాట్లాడారు. వారి విద్యకు సంబంధించి గురుకులాల ఆర్‌సీఓతో మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. డీఈఓ ప్రణీత, ఎంపీడీఓ రవీందర్, తహసీల్దార్ తుకారాం తదితరులు ఉన్నారు.


సిరికొండలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

చింతలబోరి అడవుల్లో పెద్దపులి సంచారం

● భయంతో తిరుగుముఖం పట్టిన సిబ్బంది

సొనాల(బోథ్), న్యూస్‌టుడే : బోథ్ మండలం చింతలబోరి అటవీ ప్రాంతంలో మంగళవారం పెద్దపులి అటవీ సిబ్బంది కంటపడింది. స్థానికులు, అటవీ సిబ్బంది వివరాల ప్రకారం.. బోథ్ మండలంలో విధులు నిర్వహించే ఓ మహిళా ఎఫ్‌బీవో, ఓ యానిమల్ ట్రాకర్‌తో కలిసి మధ్యాహ్నం విధుల్లో భాగంగా అటవీ ప్రాంతానికి వెళ్లింది. అటవీ ప్రాంతంలో పర్యటిస్తున్న సమయంలో ఎదురుగా పెద్ద పులి వారి కంటపడింది. భయాందోళనలకు గురైన సిబ్బంది తిరుగుముఖం పట్టారు. వెంటనే మిగతా సిబ్బందికి సమాచారం అందించారు. బోథ్ మండలంలో విధులు నిర్వహించే అటవీ సిబ్బంది వాహనంలో అటవీ ప్రాంతానికి వెళ్లగా పెద్దపులి పొదల్లో వారి కంటపడింది. పులి సంచరించిన ప్రాంతంలో ట్రాప్ కెమెరాలను బిగించారు.

☛ ఈ విషయమై అటవీ సిబ్బందిని సంప్రదించగా.. అటవీ ప్రాంతంలో పెద్దపులి కనిపించిన మాట వాస్తవమేనని, పూర్తి వివరాలు బుధవారం వెల్లడిస్తామని పేర్కొన్నారు.

ఆయుధాలపై అవగాహన

బోథ్, న్యూస్‌టుడే : బోథ్‌లోని పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా మంగళవారం ఓపెన్‌హౌజ్ కార్యక్రమాన్ని సీఐ రమేష్, ఎస్ఐ ప్రవీణ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, పలు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పోలీసులు విద్యార్థులకు ఆయుధాల వాడకంపై అవగాహన కల్పించారు. పోలీసుల పని తీరు, స్టేషన్ ఎలా ఉంటుందో వివరించారు. శిక్షణ ఎస్ఐ మధుకృష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు రంగారావు, లస్మన్న, రాంచందర్, కానిస్టేబుళ్లు అశోక్, రామ్మూర్తి, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.


బోథ్ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ప్రవీణ్

మినీ ట్యాంక్‌బండ్‌కు పునరుజ్జీవం

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే:

గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల పట్టింపు లేనితనంతో ఖానాపూర్ చెరువు పట్టణవాసులకు ఆహ్లాదాన్ని పంచకపోగా గుర్రపుడెక్క, మురుగు నీటితో అధ్వానంగా తయారైంది. అటు మత్స్యకారుల ఉపాధికి సైతం తీరని నష్టం వాటిల్లుతోంది. తాజాగా అమృత్ 2.0 పథకం కింద మినీ ట్యాంక్‌బండ్ కోసం రూ.3.15 కోట్లు మంజూరయ్యాయి. ప్రజారోగ్య మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు సుందరీకరణకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) తయారీకి సిద్ధం అవుతున్నారు.

ఖానాపూర్ చెరువు సుందరీకరణకు రూ.3.15 కోట్లు

కట్ట పొడిగింపు

చెరువులో మురుగు కలవకుండా పైప్‌లైన్‌తో తరలించాలని ఇటీవల అధికారులు నిర్ణయించారు. చెరువులోని గుర్రపు డెక్క తొలగిస్తే చేపల పెంపకానికి అనువుగా ఉంటుంది. గతంలో మత్స్యకారులు ఈ చెరువులో 50 టన్నులకుపైగా చేపలు పట్టేవారు. తాజాగా మంజూరైన రూ.3.15 కోట్ల నిధులతో అధికారులు చెరువు కట్టను బలోపేతం చేయనున్నారు. ఆక్రమణల కారణంగా చెరువు కట్ట ప్రస్తుతం మధ్యలో ఆగిపోయింది. ప్రస్తుతం మంజూరైన నిధులతో చెరువు కట్టను ఆర్ఫా గార్డెన్ ముందున్న రహదారికి కలపనున్నారు. చెరువు కట్టపై సెంట్రల్ లైటింగ్, మొక్కలు నాటనున్నారు. కట్టపై సిమెంటు బల్లలను ఏర్పాటు చేయనున్నారు.


చెరువు కట్టపైకి రహదారి నుంచి నేరుగా వెళ్లేలా.. ఆర్ఫా గార్డెన్ ముందున్న రహదారిని కలిపేలా కట్టను అభివృద్ధి చేయనున్నారు

గతంలో అసంపూర్తి పనులు

ఖానాపూర్ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చి పర్యాటకంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం 2017లో అంకురార్పణ చేసింది. ఇందుకు మిషన్ కాకతీయ పథకం కింద రూ.4.83 కోట్ల నిధులను వెచ్చించింది. అప్పట్లో పనులు ప్రారంభంకాగా గుత్తేదారు నిర్లక్ష్యానికి తోడు అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు నాసిరకంగా జరిగాయి. చాలా చోట్ల చెరువు కట్ట కోతకు గురైంది. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినా దీపాలు వెలగడం లేదు. స్థానికంగా ఉన్న కొందరు కట్టపై పశువులను కట్టేయడం, వ్యర్థాలు వేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. కట్టపై తుమ్మచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగాయి. చీకటిపడితే మందుబాబులకు అడ్డాగా మారుతోందని, ఉదయం, సాయంత్రం వేళల్లో నడక సాగించలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు మంజూరయ్యాయి

- అరుణ్, డీఈఈ, ప్రజారోగ్య మున్సిపల్ ఇంజినీరింగ్

ఖానాపూర్ చెరువు సుందరీకరణకు అమృత్ 2.0 పథకం కింద రూ.3.15 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సుందరీకరణ పనులకు సంబంధించిన డీపీఆర్ తయారు చేస్తున్నాం. ఇది ఆమోదం పొందగానే టెండర్ పిలిచి పనులు చేపడతాం.

పేదలపై అభిమానం.. సేవే పరమార్థం



● పల్లెబాట పట్టిన సివిల్ సర్వీస్ శిక్షణ అధికారులు



సివిల్ సర్వీస్ శిక్షణ అధికారుల బృందం క్షేత్రస్థాయి శిక్షణలో భాగంగా పల్లెబాట పట్టింది. ఆదిలాబాద్ గ్రామీణ మండలం లోకారి, ఖండాల, తదితర గ్రామాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్న అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలిస్తున్నారు. ఆదివాసీల స్థితిగతులు, తాగునీరు, రహదారులు, విద్యుత్తు సౌకర్యాలు, పాడిపంటలు, రవాణా సౌకర్యం, వ్యవసాయ పద్ధతులు అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను తెలుసుకుంటూ గ్రామాభివృద్ధికి సలహాలు, సూచనలు అందిస్తున్నారు. గుర్తించిన సమస్యలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందిస్తామన్నారు. ఈ పర్యటన ఎంతో ఉపయోగపడుతున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక సివిల్ సర్వీస్‌లో ఉన్న శిక్షణ అధికారులు ప్రజా సేవే లక్ష్యమని, పేదలంటే అభిమానమని, వారికి సేవ చేయడం ఆనందంగా భావిస్తున్నట్లు 'ఈనాడు'తో వారి మనోగతాన్ని పంచుకున్నారు. ప్రణాళికాబద్ధంగా, పట్టుదలతో చదివితే లక్ష్యానికి పేదరికం అడ్డురాదని నేటి యువతకు దిశానిర్దేశం చేశారు.

-న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం



ఆదిలాబాద్ మండల అధికారులతో సివిల్ సర్వీస్ శిక్షణ అధికారులు

నాన్న కష్టమే ఐపీఎస్‌ను చేసింది



నేను రైతు బిడ్డను. నాన్న వ్యవసాయంలో ఆరుగాలం పడే కష్టం ముందు నా లక్ష్యం అసాధ్యం కాదనిపించింది. ప్రాథమిక విద్య, ఇంటర్ ప్రైవేటులో.. డిగ్రీ బీఎస్సీ కంప్యూటర్ ప్రభుత్వ కళాశాలలో పూర్తి చేశా. ఎలాంటి శిక్షణ లేకుండా ఇంటి వద్దనే సొంత ప్రిపరేషన్‌తో రోజూ 8 గంటలు చదివేవాడిని. ఎలాంటి శిక్షణ లేకుండానే మొదటి ప్రయత్నంలో సివిల్స్‌లో ఐపీఎస్‌కు ఎంపికయ్యాను. నిబద్ధత, పట్టుదల, ఇష్టంతో చదివితే సాధ్యం కానిది ఏది లేదు.

- రాంనీక్ గౌతమ్, ఐపీఎస్ శిక్షణ అధికారి, ఉత్తరప్రదేశ్

ఓడిపోతే కుంగిపోవద్దు..



పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా ఒకటి కాదు.. రెండు కాదు. . మూడేళ్లు కష్టపడి చదివాను. లక్ష్య సాధనలో ఎన్నో ఆటుపోట్లు వచ్చినా లక్ష్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాను. అనుకున్నది సాధించి ఐఎస్ఎస్‌కు ఎంపికయ్యాను. నాన్న చతుర్భాజ్ గుప్తా వ్యాపారం చూసుకుంటారు. అమ్మ కామిని గుప్తా గృహిణి. వారి ప్రోత్సాహంతోనే విజయం సాధించాను. ఒక్కసారి ఓడిపోగానే వదిలేయొద్దు.

- ప్రకర్ గుప్తా, ఐఎస్ఎస్, ఉత్తరప్రదేశ్

దిల్లీకి వెళ్లాల్సిన అవసరం లేదు

- కౌషల్ కిశోర్, ఐఎఫ్ఎస్, బిహార్



సివిల్స్ సన్నద్ధతలో ఆన్‌లైన్ విద్యకు ప్రాధాన్యమిచ్చా. బీటెక్ ఐఐటీ దిల్లీలో పూర్తి చేశా. ఐఐటీ జేఈఈలో టెక్నాలజీ కన్సల్టెంట్‌గా పని చేశా. ఉద్యోగం చేస్తూనే ఆన్‌లైన్‌లోనే శిక్షణ తీసుకున్నాను. సివిల్స్‌లో శిక్షణ కోసం దిల్లీకి వెళ్లాల్సిన అవసరం లేదు. ఒకవేళ శిక్షణ కావాలనుకున్నవారు హైదరాబాద్‌లో తీసుకుంటే సరిపోతుంది. ప్రణాళిక, సరైన మార్గాన్ని ఎంచుకుంటే అనుకున్నది సాధించడానికి అవకాశం ఉంటుంది.

పోలీసులపై నమ్మకం కలిగిస్తా



వ్యక్తిగత నైపుణ్యం, పట్టుదల ఉంటే సివిల్స్ విజయం సాధించవచ్చు. యూట్యూబ్, గూగుల్ మాధ్యమాల ద్వారా మనకు అవసరమైన సమాచారం సులువుగా పొందవచ్చు. చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇంకా ఎలాంటి ఆలోచనలకు అవకాశం ఇవ్వొద్దు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే లక్ష్యాన్ని చేరుకున్నాను. ప్రజాసేవే లక్ష్యంగా పని చేస్తాను. పోలీసులపై మరింత నమ్మకం కలిగిస్తాను.

- రోషన్, ఐపీఎస్ శిక్షణ అధికారి, రాజస్థాన్

వార్తా పత్రికలు రోజూ చదవాలి

- ప్రసాద్ కృష్ణన్, ఐఆర్ఎస్, కేరళ



మాది కేరళలోని త్రివేండ్రం. నాన్న నందాకుమారన్ ప్రైవేట్ ఉద్యోగి. అమ్మ ప్రైవేట్ ఉపాధ్యాయురాలు. సివిల్స్ సన్నద్ధతలో భాగంగా వార్తా పత్రికలు రోజూ చదవాలి. అవి మన జనరల్ నాలెడ్జిని, విశ్లేషించే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయి. శిక్షణలో ముఖ్యంగా సాధన ఎక్కువగా ఉండాలి. ప్రతి అంశంపై పట్టు సాధించాలి. అమ్మానాన్నల కష్టాలను చూసి అనుకున్న లక్ష్యం వైపు వెనుకడుగు వేయకుండా ప్రయత్నించా. చెన్నైలో ఐఆర్ఎస్ కస్టమ్స్, పరోక్ష పన్నులో పోస్టు ఇచ్చారు. పేదలకు సేవ చేయడం వరంగా భావిస్తున్నాను.

ప్రతికూలతలు దాటి.. విజేతగా నిలిచి!

● పెళ్లి.. పిల్లలు కొలువుకు ఆటంకం కాదని నిరూపించిన సుమలత

న్యూస్‌టుడే, ఉట్నూరు : పేద కుటుంబంలో జన్మించి ప్రతికూల పరిస్థితుల మధ్య చదివింది ఆమె.. చిన్న వయసులోనే పెద్దలు పెళ్లి చేశారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యం ముందు అవన్నీ కరిగిపోయాయి. గృహిణిగా ఉంటూనే.. భర్త ప్రోత్సాహంతో ఉన్నత విద్యను పూర్తి చేసి రాత్రింబవళ్లు కష్టపడి విజయం సాధించారు. ఇటీవల విడుదలైన ఉద్యోగాల ఫలితాలలో ఎస్జీటీగా కొలువు సాధించి ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారు.



నిర్మల్ జిల్లా కడెం మండలానికి చెందిన రాపెల్లి రాయలింగు, సత్తవ్వ దంపతులది నిరుపేద వ్యవసాయ కుటుంబం. వీరికి రవీందర్, వెంకటేష్, సుమలత ముగ్గురు సంతానం. సుమలత స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివారు. పదో తరగతిలో 526 మార్కులు సాధించి స్థానికుల మన్ననలు అందుకున్నారు. తల్లిదండ్రులు అప్పులు చేసి మంచిర్యాలకు పంపించి ఇంటర్ చదివించారు. ఆ తరువాత ఆమె టీటీసీ ప్రవేశ పరీక్ష రాసి ర్యాంకు పొందడంతో ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డైట్ కళాశాలలో టీటీసీ సీటు సాధించారు. కుటుంబ పరిస్థితుల కారణంగా తల్లిదండ్రులు ఆమె టీటీసీ చేస్తుండగానే కొండా సత్యం అనే యువకుడికి ఇచ్చి వివాహం చేశారు.

భర్త ప్రోత్సాహంతో..

టీటీసీ చేస్తుండగానే పెళ్లి చేసినా.. లక్ష్యాన్ని మాత్రం వీడలేదు. ఆమెకు హిమన్ష్, మేధాన్ష్ అనే ఇద్దరు పిల్లలు జన్మించారు. ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలనేది తన ఆశయమని భర్త సత్యంతో మనసులోని మాటను పంచుకున్నారు. భర్త ఆమెను ప్రోత్సహించడంతో టీటీసీ పూర్తి చేయడంతోపాటు డిగ్రీ చదివారు. బీఈడీ ప్రవేశ పరీక్ష రాసి ర్యాంకు సాధించి బీఎడ్ చేశారు. పీజీలో ఎమ్మెస్సీ మ్యాథ్స్ చేశారు. ఉద్యోగాల కోసం కసితో సాధన చేశారు. డీఎస్సీ రాశారు. మంచి ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఉద్యోగం పొందారు. పెళ్లయిన పదేళ్ల తరువాత తన కలను నెరవేర్చుకున్నారు. తాజాగా దస్తురాబాద్ మండం గొడిసిర్యాలలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో టీచరుగా తొలి పోస్టింగ్ పొందారు. పెళ్లి.. పిల్లలు.. కుటుంబ బాధ్యతలు ఇవేవి విజయానికి అడ్డుకాదని నిరూపించారు.

సమీకృత వ్యవసాయం, సాంకేతిక విధానంపై అవగాహన



విద్యార్థులకు డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం జగిత్యాల, సిరిసిల్ల కళాశాలలకు చెందిన కృషి అనుభవ విద్యార్థులకు సమీకృత వ్యవసాయ విధానం, డ్రోన్ సాంకేతిక విధానంపై మంగళవారం మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి అవగాహన కల్పించారు. మందమర్రి మండలంలోని బొక్కలగుట్ట గ్రామంలోని సమీకృత వ్యవసాయ క్షేత్రంలో సమీకృత వ్యవసాయ విధానంపై అవగాహన కల్పించారు. సమీకృత వ్యవసాయ విధానంలో వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి, చేపలు, కోళ్లు, తేనెటీగల పెంపకం, చిన్నతరహా పరిశ్రమలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ విధానంతో రైతుకు ఎక్కువ నికర ఆదాయంతో పాటు నష్ట భయం తగ్గుతుందని తెలిపారు. సారంగపల్లి గ్రామంలోని ఓ పొలంలో డ్రోన్ పరికరం ద్వారా పురుగు మందుల పిచికారీపై ప్రదర్శనాత్మక అవగాహన కల్పించారు. ఈ విధానం ద్వారా పది లీటర్ల నీటిని ఉపయోగించి ఆరు నిమిషాల్లో ఒక ఎకరా విస్తీర్ణంలో పురుగు మందులు పిచికారి చేసుకోవచ్చని తెలిపారు. ఏఈఓలు ముత్యం తిరుపతి, కనకరాజు, విద్యార్థులు తిరుపతి, శ్రీధర్, నవితేజ, శ్రీచరణ్, విపిన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు లేక.. పర్యవేక్షకులకు పరీక్ష


మంచిర్యాలలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతోంది. జనరల్ మెడిసిన్‌లో వైద్యులు సక్రమంగా రావడం లేదు. పిల్లల విభాగం పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. ఇప్పుడు ఈఎన్‌టీ(చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు) వంతు వచ్చింది. ఉన్న ఇద్దరు సెలవులో ఉండటంతో తప్పని పరిస్థితుల్లో ఆయా విభాగం ప్రొఫెసర్, జీజీహెచ్ పర్యవేక్షణాధికారి ఓపీ గదిలో ఉండాల్సి వస్తోంది.

- న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ



ఈఎన్‌టీ ఓపీ విభాగంలో మంగళవారం పరీక్షలు నిర్వహిస్తున్న పర్యవేక్షణాధికారి డా.హరిశ్చంద్రారెడ్డి

పక్షం రోజులే గడువు!



● ఎమ్మెల్సీ ఓటరు నమోదులో టీచర్లు, పట్టభద్రుల నిర్లిప్తత

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: పట్టభద్రుల, ఉపాధ్యాయ మండలి ఎన్నికల సందడి మొదలైంది. ఇందుకు కీలమైన ఓటరు నమోదు ప్రక్రియ మాత్రం మందకొడిగా సాగుతోంది. ఓటు నమోదు దరఖాస్తుల స్వీకరణకు నవంబరు ఆరో తేదీ తుది గడువు. అంటే మరో పక్షం రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది.

జిల్లాలవారీగా ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు



జిల్లా	ఉపాధ్యాయులు	పట్టభద్రులు
కుమురంభీం	12	1,049
మంచిర్యాల	61	7,742
ఆదిలాబాద్	37	3,063
నిర్మల్	55	4,838

● జిల్లా
● ఉపాధ్యాయులు
● పట్టభద్రులు

బోధకుల నిరాసక్తత



సాధారణంగా ఉపాధ్యాయ, అధ్యాపక వృత్తిలో కొనసాగే వారిని మేధావివర్గంగా భావిస్తుంటాం. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు విషయంలో మాత్రం ఆ వర్గం దూరంగా ఉంటోంది. పలు సంఘాలు పాఠశాలలకు వెళ్లి స్వచ్ఛందంగా నమోదు పత్రాలు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 30 వేల మంది టీచర్లు, అధ్యాపకులు ఉండగా ఇప్పటి వరకు 165 మంది మాత్రమే ఎమ్మెల్సీ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు.

ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పట్టభద్రులు, టీచర్లు ఓటర్లుగా ఉంటారు. మండలి ఎన్నికల్లో ఓటు వేయాలంటే కొత్తగా అర్హులంతా దరఖాస్తు చేసుకోవాల్సిందే. కిందటి ఎన్నికల ఓటరు జాబితాలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో టీచర్లు 4,599 మంది, పట్టభద్రులు 38,908 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం ఇప్పటి వరకు టీచర్లు 165 మంది దరఖాస్తు చేసుకుంటే పట్టభద్రుల ఓటు కోసం 16,692 మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

కేంద్రాలు వెలవెల..



అన్ని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో టీచరు, పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక అధికారిని నియమించి దరఖాస్తులను అందుబాటులో ఉంచినా ఆ కేంద్రాలకు వచ్చేవారే కరవయ్యారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉన్నా ఓటర్ల నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉంటోందని అధికారవర్గాల మాట.

ఎవరు అర్హులు..

పట్టభద్రులు ఓటు నమోదు(ఫాం-18) చేసుకోవాలంటే 2021 అక్టోబరు 31 నాటికి డిగ్రీ పూర్తయి ఉండాలి. టీచర్లు/అధ్యాపకులైతే 2018 నవంబరు ఒకటి నుంచి 2024 అక్టోబరు 31 వరకు మూడు సంవత్సరాలకు తగ్గకుండా ఉన్నత పాఠశాల, కళాశాల స్థాయి విద్యాసంస్థల్లో పనిచేసి ఉంటే వారు ఫారం-19 పూరించి ఓటు నమోదు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్‌లో నమోదు ఇలా

ఇంటి వద్ద నుంచి ఓటు నమోదు చేసుకోవాలనుకునే వారు www.ceotelangna.nic.in వెబ్‌సైటును సంప్రదించి పట్టభద్రులైతే ఫారం-18, టీచర్లయితే ఫారం-19 దరఖాస్తును పూరించి గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన డిగ్రీ సర్టిఫికెటు, ఆధార్, ఓటరు ఐడీ పత్రాలతోపాటు ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవచ్చు.



జగదాంబ ఆలయంలో కొనసాగుతున్న విద్యార్థుల చదువులు

గుడిలో సాగుతున్న బడి

ఈటీవీ - ఆదిలాబాద్, న్యూస్‌టుడే - బేల : అక్షరాలు నేర్చుకోవాలంటే బడికి వెళ్లాలి. పూజా కార్యక్రమాలకు గుడికి వెళ్లాలి. ఇది అందరికి తెలిసిందే. బేల మండలం పిట్‌గావ్(ఎల్) చిన్నారులు చదువుకోవటానికి బడికి కాకుండా గుడికి వెళ్తున్నారు. ఇక్కడ అంతా గిరిజనులే. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు మొత్తం 36 మంది విద్యార్థులు ఉన్నారు. పాత బడి శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం ఏడాది కిందట రూ.21 లక్షలు కేటాయించింది. విద్యాశాఖాధికారులు, ఇంజినీర్ల పర్యవేక్షణ కరవై గుత్తేదారు పిల్లర్లు వేసి భవన నిర్మాణాన్ని మధ్యలోనే వదిలేశాడు. స్థానికులంతా కలిసి ఆరునెలల కిందటి వరకు గ్రామంలోని హనుమాన్ ఆలయంలో, తాజాగా ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న జగదాంబ దేవి ఆలయంలో చదువులను కొనసాగిస్తున్నారు. తాజాగా నియామకాల్లో కొత్తగా ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయుడు హరికృష్ణ ఆ గుడిలోనే పిల్లలకు బోధిస్తున్నారు.

☛ ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోలేదని.. పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడకూడదనే ఆలోచనతో గుడిలో ఏర్పాటుచేసిన బడికి పంపిస్తున్నామని గ్రామస్థులు జాదవ్ విలాస్, పవార్ గోపీ ఆవేదన వ్యక్తం చేశారు.

☛ జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీతను 'ఈనాడు' సంప్రదించే ప్రయత్నం చేయగా స్పందించలేదు.



పిట్‌గావ్(ఎల్)లో ఆగిపోయిన పాఠశాల కొత్త భవన నిర్మాణ పనులు

అయిదుగురు ఏఈఓల సస్పెన్షన్

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే: రైతు బీమా విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు మంచిర్యాల జిల్లాలోని అయిదుగురు వ్యవసాయ విస్తరణాధికారుల(ఏఈఓ-గ్రేడ్)ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. లక్షెట్టిపేట, జైపూర్, బెల్లంపల్లి, నస్పూర్, చెన్నూరు మండలాలకు చెందిన ఒక్కో ఏఈఓను సస్పెండ్ చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి కల్పనను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా జిల్లాలోని అయిదుగురు ఏఈఓలను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు.

ఉపకార వేతనం.. భవితకు ఊతం





దండేపల్లి, న్యూస్‌టుడే: చదువుకోవాలనే తపన ఉన్నా ఆర్థిక స్థోమత లేక ఎంతో మంది విద్యార్థులు తమ చదువులను అర్ధంతరంగా ఆపేసిన సంఘటనలు ఉన్నాయి. ఈ తరుణంలో ప్రతిభ ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఊతం అందిస్తోంది. వీటిని అందిపుచ్చుకుని ఉన్నత విద్యను అభ్యసిస్తూ ముందుకు సాగుతున్నారు. పరీక్షలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపకార వేతనాలు (ఎన్ఎంఎంఎస్) అందిస్తోంది. నాలుగేళ్ల పాటు ఉపకారం అందుకుంటూ ఉన్నత చదువులు చదివే అవకాశముంది. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జాతీయ స్థాయిలో పరీక్ష ఉంటుంది. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఏటా రూ. 12 వేల చొప్పున తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు నాలుగేళ్ల పాటు ఉపకారవేతనం అందిస్తారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అర్హులు. వచ్చే నెల 24న అన్ని జిల్లా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు.

ఇందులో మొత్తం 180 మార్కులు ఉండగా పరీక్షలో రెండు విభాగాలు ఉంటాయి.

☛ మొదటిది (పార్ట్ 1): మానసిక సామర్థ్య పరీక్ష 90 ప్రశ్నలకు 90 మార్కులుంటాయి. ఇందులో రీజనింగ్ ఎబిలిటీస్, సంఖ్యా శాస్త్రం, పదాల భిన్న పరీక్ష, నంబర్ అనాలజీ, ఆల్ఫాబెట్ అనాలజీ, కోడింగ్-డీకోడింగ్, లాజికల్ ప్రశ్నలు, వెన్‌చిత్రాలు, మిర్రర్ ఇమేజెస్, వాటర్ ఇమేజెస్ తదితర అంశాలలో ప్రశ్నలు ఉంటాయి. వీటిని సాధన చేయాలి.

☛ రెండో విభాగంలో ఏడు, ఎనిమిదో తరగతి సిలబస్ నుంచి 90 ప్రశ్నలు, 90 మార్కులుంటాయి. గణితం 20 మార్కులు, భౌతిక, రసాయన, జీవ శాస్త్రం కలిపి 35 మార్కులు, సాంఘీక శాస్త్రంలో 35 మార్కులు. పరీక్ష ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో బహుళైచ్ఛిక (మల్టిపుల్ ఛాయిస్) రూపంలో ఉంటాయి. పరీక్షకు కేవలం నెల రోజులు మాత్రమే ఉండటంతో ప్రణాళికాబద్ధంగా సాధన చేస్తే విజయం దక్కుతుంది. ఉమ్మడి జిల్లా నుంచి 240 మంది వరకు ఎన్నికయ్యే అవకాశముంది.



సాధన చేస్తున్న విద్యార్థులు

ఈ ఏడాది జిల్లాల వారీగా పరీక్ష రాసే విద్యార్థులు

జిల్లా	అభ్యర్థులు
ఆదిలాబాద్	564
మంచిర్యాల	1059
నిర్మల్	926
కుమురంభీం	482

● జిల్లా
● అభ్యర్థులు

ఉన్నత చదువులు చదువుతూ..

-రాంటెంకి విష్ణువర్ధన్



జన్నారం మండలం కిష్టాపూర్ ఉన్నత పాఠశాలలో చదివిన రాంటెంకి విష్ణువర్ధన్ ఎనిమిదో తరగతి పూర్తికాగానే జాతీయ ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. ఉపకార వేతనం పొందుతూ ఇక్కడే పదో తరగతి పూర్తి చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని సెంట్రల్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలో ఇంటర్మీడియట్ చేస్తున్నారు. తన చదువులకు ఉపకార వేతనం ఎంతో తోడ్పడిందని ఆయన చెబుతున్నారు. ఇదే పాఠశాల నుంచి గతేడాది పది మంది విద్యార్థులు ఎంపికకాగా ఇప్పటి వరకు 240 మంది ఎంపిక కావడం గమనార్హం..

ప్రణాళికాబద్ధంగా సాధన

- ముత్తె వెంకటమల్లు, ఉపాధ్యాయుడు, వెల్గనూర్



ఉపకార వేతనం మధ్యతరగతి, పేద కుటుంబాల విద్యార్థులకు ప్రయోజనం. విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం వరిస్తుంది. మంచి భవిష్యత్తు ఉంటుంది. గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రంలోని వివిధ పాఠాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. మానసిక సామర్థ్యానికి సంబంధించిన అంశాలను రోజూ సాధన చేయాలి. గత పరీక్షల పేపర్లలో వచ్చిన ప్రశ్నలకు అనుగుణంగా సాధన చేయాలి.



● గతేడాది జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైన జన్నారం మండలం కలమడుగు విద్యార్థులతో ఉపాధ్యాయులు. పది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రతి రోజూ పరీక్ష రాయబోయే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి, ఉపాధ్యాయులు కలిసి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు.

ప్రాణం తీసిన కరెంట్



సతీష్

కోటపల్లి, న్యూస్‌టుడే: వ్యవసాయంలో తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. సాగు పనుల్లో తండ్రితో పాటు బాధ్యతను పంచుకున్నాడు. ప్రమాదవశాత్తు జరిగిన విద్యుదాఘాతంతో యువరైతు విగత జీవిగా మారాడు. ఈ ఘటన ఆ కుటుంబంలో తీరని శోకాన్ని నింపింది. వివరాల్లోకి వెళ్తే.. కోటపల్లి మండలం రాపన్‌పల్లి గ్రామానికి చెందిన భూర్తి సతీష్ (25) యువరైతు మంగళవారం పత్తి చేనుకు నీటి తడులను అందించేందుకు వెళ్లాడు. మోటారుకు విద్యుత్తు సరఫరా చేసే తీగ చెడిపోయి నీటిని బయటికి వదిలే ఇనుప పైపును తాకి ఉంది. ఇది గమనించని సతీష్ మోటారును స్టార్ట్ చేసి సంబంధిత పైపును పట్టుకోవడంతో విద్యుత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. రాజబాపు - పద్మ దంపతులకు ఇద్దరు కొడుకులు ఉండగా మృతుడు సతీష్ మొదటి సంతానం. తమకున్న కొద్ది పాటు భూమితో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని జీవనోపాధి పొందుతున్న కుటుంబంలో కుమారుడు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎస్సై రాజేందర్ సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు.

27న మందకృష్ణ మాదిగ రాక

జన్నారం, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈ నెల 27న జన్నారం వస్తున్నట్లు మాదిగ సంఘం జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, మండల అధ్యక్షుడు కొండుకూరి ప్రభుదాస్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లుగా వారు పేర్కొన్నారు. నాయకులు మామిడిపెల్లి ఇంధయ్య, కృష్ణ, రమేశ్, రవి, రాజేశ్, ఎల్లయ్య, రాహుల్, అంజన్న, వెంకటేశ్, ప్రశాంత్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్:

? ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో వీధి దీపాలు వెలగడం లేదు. పిచ్చిమొక్కలు పెరిగి పాములు తిరుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం నడకకు వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. - సుధాకర్‌రెడ్డి, న్యాయవాది

✔ మైదానంలో వీధి దీపాలు పునరుద్ధరించేలా చూస్తాం. వాకింగ్ ట్రాక్‌పై పిచ్చిమొక్కలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - వెంకటేశ్వర్లు, డీవైఎస్‌ఓ

న్యూస్‌టుడే, గుడిహత్నూర్:

? గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుక ఉన్న కాలనీలో వీధులు శుభ్రం చేయడం లేదు. - పాండు, గుడిహత్నూర్

✔ సిబ్బందిని పంపి వీధులను శుభ్రం చేయిస్తాం. - రాందాస్, పంచాయతీ కార్యదర్శి గుడిహత్నూర్

ఈనాడు స్పందనకు వందనం

బడికి సారొచ్చారు!

బోథ్, న్యూస్‌టుడే : బోథ్ మండలంలోని నేరడిపల్లెలోని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలో రెండు నెలలుగా ఉపాధ్యాయుడు లేక పాఠశాల మూసి ఉంటోంది. విద్యార్థులు చదువుకు దూరమవడంతో మంగళవారం 'ఈనాడు'లో 'సారు లేని బడి.. చదువెలా సాగాలి మరి' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన గిరిజనశాఖ అధికారులు పాఠశాలను సందర్శించి, సీఆర్‌టీ సాయికృష్ణను సదరు పాఠశాలకు కేటాయించారు. రెండు నెలల అనంతరం గ్రామంలోని విద్యార్థులు పాఠశాల బాట పట్టారు.



నేరడిపల్లె ప్రభుత్వ గిరిజన పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న సీఆర్‌టీ సాయికృష్ణ

సెల్ఫీ వీడియో తీసుకుని.. రైలు కిందపడి బలవన్మరణం



గుమ్మల దేవన్న

తాంసి, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం తాంసి మండలంలో చోటుచేసుకుంది. పొన్నారికి చెందిన గుమ్మల దేవన్న(30) కొంతకాలంగా మద్యానికి బానిసై, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. భార్య సైతం పుట్టింటి నుంచి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. మంగళవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో మద్యం తాగి, హస్నాపూర్ సమీపంలోని రైలు పట్టాల వైపు వెళ్లాడు. చావుకు దగ్గరలో ఉన్నా.. మరో అరగంటలో ఆత్మహత్య చేసుకుంటున్నాను. స్థలం ఇదేనంటూ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. 11 గంటలకు మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ వస్తున్న ఇంటర్‌సిటీ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య, కూతురు ఉంది.

కడుపు నొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : కడుపునొప్పి భరించలేక పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పాటగూడలో చోటుచేసుకుంది. ఎస్సై సునీల్ వివరాల ప్రకారం.. కుమురం భీం జిల్లా జైనూర్ మండలం డబోలికి చెందిన మెస్రం రాజేశ్(20) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రితో పాటు నాటు వైద్యం చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. ఈ నెల 20న ఇంద్రవెల్లి మండలం వడ్గాంలో ఉంటున్న తమ బంధువుల వద్దకు వచ్చాడు. 21న పాటగూడ శివారులో వ్యవసాయ చేసుకు వెళ్లి గుర్తు పురుగు మందు తాగాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. తండ్రి భీంరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగు మందు తాగి...

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో పురుగు మందు తాగి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆదిలాబాద్ టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు వివరాల మేరకు.. మహారాష్ట్రలోని ఉమర్‌ఖేడ్ తాలూకా టాక్లి గ్రామానికి చెందిన అలాల్ బాలాజీ(32) మద్యం కోసం సోమవారం భార్యను డబ్బులు అడగగా ఆమె నిరాకరించింది. ఇంటి వద్దనే పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మంగళవారం జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రహదారి ప్రమాదంలో దుర్మరణం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : రహదారి ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలైనట్లు ఆదిలాబాద్ టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ తాలూకా లింగి గ్రామానికి చెందిన రావణె సంతోష్(27) సోమవారం మాండ్వికి ద్విచక్రవాహనంపై వెళ్తూ ఆగి ఉన్న వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. తలకు బలమైన గాయాలు కాగా రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంగళవారం జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కుక్క దాడిలో చిన్నారులకు గాయాలు

ఆదిలాబాద్ గ్రామీణం(అంకోలి), న్యూస్‌టుడే : అంకోలిలో మంగళవారం కుక్క దాడిలో 15 ఏళ్ల అపర్ణ, 8 ఏళ్ల బండారి ప్రణయతో పాటు అయిదేళ్ల బాలుడు నవనీత్ గాయపడ్డారు. బాధిత చిన్నారులను చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు.

జూదరులపై కేసు నమోదు

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ గ్రామీణ మండలం జందాపూర్ రైల్వే వంతెన సమీపంలో కొనసాగుతున్న జూద స్థావరంపై గ్రామీణ పోలీసులు దాడి చేశారు. గ్రామీణ ఎస్ఐ ముజాహిద్ వివరాల ప్రకారం.. జూదమాడుతున్న ఆదిలాబాద్ పట్టణానికి చెందిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

బేల, న్యూస్‌టుడే : బేల శివారులో కొనసాగుతున్న మట్కా కేంద్రంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఎస్ఐ డి.రాధిక ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి నిర్వాహకులు దహిగావ్‌కు చెందిన షేక్ షకీల్, అవినాష్ వాంకడే, మట్కా ఆడడానికి వచ్చిన షేక్ హైమద్‌ను పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ధర్నా చేసిన ఎనిమిది మందికి తాఖీదులు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : గత నెల 21న పట్టణంలోని కృష్ణా ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్ ముందు ప్రధాన రోడ్డుపై ఆందోళనలు, ధర్నా చేసి పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ఎనిమిది మందిని మంగళవారం స్టేషన్‌కు పిలిపించి 41ఏ సెక్షన్ కింద తాఖీదులు జారీ చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. మావల ఎస్టీ వసతి గృహంలో చదువుకునే రాఠోడ్ జితేందర్ పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకోగా మావల పోలీసు స్టేషన్‌లో అదే రోజు అనుమానాస్పద మృతిగా కేసు నమోదైందన్నారు. మృతికి సరైన కారణాలు తెలుసుకోకుండా నార్నూర్ మండలం చోర్‌గాంకు చెందిన అతడి బంధువులు, కొంత మంది విద్యార్థులు రాద్ధాంతం చేసి ప్రజా జీవనానికి భంగం కలిగించారని పేర్కొన్నారు.

అయోడిన్‌పై విద్యార్థులకు అవగాహన

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : నవ్వుతున్న సూర్యుడి గుర్తు ఉన్న ఉప్పు ప్యాకెట్లను వినియోగించాలని, ఆ ప్యాకెట్లలో అయోడిన్‌శాతం సరిపడా ఉంటుందని డీఎంహెచ్‌వో కృష్ణ అన్నారు. బ్రాహ్మణవాడ ప్రాథమి కోన్నత, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ సముదాయంలో ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆశాకార్యకర్తలు పాఠశాలలో వాడుతున్న ఉప్పు నమూనాలు సేకరించి పరీక్షలు చేసిచూపించారు. అదనపు వైద్యాధికారులు డా.నరేందర్, డా.మెటపల్లి శ్రీధర్, డా.గజానన్, ఎన్‌హెచ్ఎం పీవో డా.వంశీకృష్ణ, హెచ్ఎం స్వామి, ఎస్ఓ ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు అపర్ణ, అనిల్, పుల్లీబౌలీ ఆరోగ్య కేంద్ర సీవో నవీన్, ఆశాకార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒప్పించి.. బడి బాట పట్టించి!



బడి మానేసిన విద్యార్థిని తిరిగి పాఠశాలలో చేరాలని చెబుతున్న డీడీ వసంత్‌రావు

ఉట్నూరు మండలం పిట్లగూడలో బడి మానేసిన బాలుడిని ఐటీడీఏ ఇన్‌ఛార్జి డీడీ జాదవ్ వసంత్‌రావు ఒప్పించి గిరిజన ఆశ్రమ పాఠశాలలో చేరేందుకు ఒప్పించారు. మంగళవారం డీడీ మండలంలోని పిట్లగూడ పాఠశాలను సందర్శించారు. పిట్లగూడకు చెందిన రాజేందర్ తల్లిదండ్రులు జగిత్యాలకు వలస వెళ్లడంతో అక్క ఇంట్లో ఉంటున్నట్లు తెలిసింది. విద్యార్థి, అతడి సోదరితో పాటు స్థానికులతో మాట్లాడి చదువు ప్రాముఖ్యతను వివరించారు. ఏసీఎంఓ జగన్‌తో మాట్లాడి బాలుడిని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చేర్పించాలని డీడీ తెలిపారు. బుధవారం బడిలో చేరేందుకు బాలుడు అంగీకరించాడు. - న్యూస్‌టుడే, ఉట్నూరు గ్రామీణం

16 బల్దియా దుకాణాలకు వేలం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్: ఆదిలాబాద్ పురపాలక యంత్రాంగం ఆదాయ వనరులు పెంచుకోవడంపై దృష్టి సారించింది. పట్టణంలో బల్దియాకు చెందిన 16 దుకాణాలను అద్దె ప్రాతిపదికన వేలం నిర్వహించాలని నిర్ణయించింది. వినాయక్ చౌక్‌లోని పాత మున్సిపల్ కార్యాలయంలో 13, పాత బస్టాండ్ ప్రాంతంలో రెండు, శివాజీచౌక్‌లో ఒక దుకాణాలను వేలం వేయనున్నారు. ఈ నెల 30 వరకు బల్దియా కార్యాలయంలో బిడ్డర్ల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. నవంబరు 2న బల్దియా కార్యాలయంలో వేలంపాటకు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యాపారపరంగా డిమాండ్ ఉన్న ప్రాంతంలో షాపులు ఉండటంతో బిడ్డర్ల నుంచి భారీగా స్పందన వస్తుందని, అధిక ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వేలంపాటను షాపు నెలవారీ అద్దె ధరపై కాకుండా ధరావతుపై నిర్వహించనున్నారు. ప్రతి దుకాణానికి కనీస ధరావతు ధర రూ.50 వేలుగా నిర్ణయించారు. వేలం పాటకు రిజర్వేషన్ పద్ధతిని అమలు చేయనున్నారు. వేలం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని, వ్యాపారాలు చేయాలనుకునే ఉత్సాహవంతులు దరఖాస్తు చేసుకోవాలని బల్దియా అధ్యక్షుడు జోగు ప్రేమేందర్ కోరారు.

కుమురం భీంకు ఘన నివాళులు



కుమురంభీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీఏజీఎస్ నాయకులు

నార్నూర్, ఎదులాపురం, ఆదిలాబాద్ అర్బన్, ఉట్నూరు, ఇచ్చోడ, న్యూస్‌టుడే : పోరాట యోధుడు కుమురంభీం జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. నార్నూర్‌లో ఖాందేవునికి ప్రత్యేక పూజలు చేసి అక్కడి నుంచి భీం విగ్రహం వరకు ర్యాలీ తీశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు నివాళులర్పించారు.



నార్నూర్ ఖాందేవుని ఆలయం నుంచి భీం విగ్రహం వరకు ఆదివాసీల ర్యాలీ



ఓయూలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు



సిరిచెల్మలో... ఎంపీ గోడం నగేష్



ఆదిలాబాద్: కిసాన్ కాంగ్రెస్ నాయకులు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రిమ్స్ వైద్యులు

ప్రాథమిక స్థాయిలో చికిత్సతో క్యాన్సర్ దూరం

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : రొమ్ము క్యాన్సర్‌కు ప్రాథమిక దశలోనే చికిత్స పొందితే పూర్తి స్థాయిలో నయమవుతుందని డీఎంహెచ్ఓ కృష్ణ, రిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాఠోడ్ జైసింగ్ తెలిపారు. రిమ్స్ ఆధ్వర్యంలో అధ్యాపక బృందం, వైద్య విద్యార్థులతో మంగళవారం రిమ్స్ నుంచి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్టేడియంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. రిమ్స్ వైస్ ప్రిన్సిపల్ విద్యా విల్సన్, వైద్యులు సత్యనారాయణ, శిరీష్, దీపక్, మిట్పల్లివార్ శ్రీధర్(ఎన్‌సీడీ అధికారి), జక్కుల శ్రీకాంత్(క్యాన్సర్ నిపుణుడు), కార్తిక్, సింధూజ, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు శక్తి అభియాన్‌లో చేరండి



మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

ఉట్నూరు, న్యూస్‌టుడే : మహిళా సాధికారత కోసం శక్తి అభియాన్‌లో చేరాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌ఛార్జి, ఇందిరా ఫెలోషిప్ ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి ఆత్రం సుగుణ అన్నారు. మంగళవారం ఉట్నూరులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 18, 19, 20వ తేదీలలో దిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అధ్యక్షతన నిర్వహించిన శక్తి అభియాన్ జాతీయ కార్యవర్గ సమావేశాలు విజయవంతం అయ్యాయన్నారు. మహిళల్లో మార్పు తెచ్చేందుకు గ్రామ స్థాయి నుంచి శక్తి అభియాన్ బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో త్వరలో దేశస్థాయి మహిళా శక్తి అభియాన్ సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశానికి రాహుల్‌గాంధీ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఇందిరా ఫెలోషిప్ శక్తి అభియాన్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. రాజవ్వ, కవిత, ఆశమ్మ, కమల తదితరులు పాల్గొన్నారు.

పైవంతెన నిర్మించాలని ఎంపీకి వినతి

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ గ్రామీణ మండలం జందాపూర్ సమీపంలోని రైల్వే గేట్ వద్ద దిగువ వంతెన బదులుగా పైవంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు ఎంపీ గోడం నగేష్‌కు విన్నవించారు. సుమారు 40పైకి గ్రామాలకు దిగువ వంతెనతో ఇబ్బందులు ఉన్నట్లు వివరించారు. దేవిదాస్, భాస్కర్, సంతోష్, మోహన్ ఉన్నారు.

పార్టీ కండువాలు లేకుండానే బహిరంగ సభ



విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే : రైతు భరోసా ఇవ్వకపోవడం, రుణమాఫీ అందరికి వర్తింపజేయకపోవడంపై ఆదిలాబాద్‌లోని రాంలీలా మైదానంలో 24న నిర్వహించే సభకు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హాజరు కానున్నందున పార్టీలకతీతంగా, అన్ని వర్గాల ప్రజలు హాజరుకావాలని భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి జోగురామన్న కోరారు. అందరు రావాలనే ఉద్దేశంతోనే ఈ సభలో ఎలాంటి పార్టీ కండువాలు ధరించడం లేదని వివరించారు. పట్టణంలోని భారాస జిల్లా కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పట్టణ అధ్యక్షుడు అజయ్, నారాయణ, రమేష్, వేణుగోపాల్ యాదవ్, ప్రహ్లాద్, సోనేరావ్, దయాకర్, నరేష్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ పట్టణం: ప్రభుత్వం హామీలు నెరవేర్చి ప్రజలకు న్యాయం చేసే వరకు ప్రశ్నిస్తూనే ఉంటామని జోగు రామన్న అన్నారు. పట్టణంలోని ఖుర్షిద్‌నగర్ కాలనీలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నాయకులు అజయ్, సలీం, స్వాగత్, పటేల్, జిలాని, షేజాత్, మోసిన్ పాల్గొన్నారు.

ఎస్పీకి ఫిర్యాదు

ఆదిలాబాద్ పట్టణం, ఎదులాపురం: హామీలతో ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని జోగురామన్న, భారాస నాయకులతో కలిసి మంగళవారం ఎస్పీ గౌష్ ఆలంకు ఫిర్యాదు చేశారు.



అదనపు గదుల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీ నగేష్, ఎమ్మెల్యే శంకర్

గిరిజన విద్యకు ప్రాధాన్యం : ఎంపీ

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం గిరిజన విద్యకు తొలి ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీ గోడం నగేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని గిరిజన బాలుర కళాశాలలో రూ.75 లక్షల కేంద్ర నిధులతో చేపట్టనున్న అదనపు గదుల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ప్రారంభించారు. నాయకులు సుభాష్, అశోక్‌రెడ్డి, ముకుంద్‌రావు, రత్నాకర్, ప్రిన్సిపల్ మారుతిశర్మ తదితరులు పాల్గొన్నారు.

అందరం కలిసి అభివృద్ధి చేసుకుందాం

ఇచ్చోడ, న్యూస్‌టుడే: అందరం కలిసి అభివృద్ధి వైపు ముందుకు సాగుదామని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం ఇచ్చోడలో కొనసాగుతున్న రహదారి పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ప్రీతంరెడ్డి ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బేల, న్యూస్‌టుడే : బేల మండలంలోని 28 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి సాయం మంజూరైంది. మంగళవారం బేల ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు విలాస్ పటేల్, తహసీల్దార్ రఘునాథ్‌రావు, ఎంపీడీఓ మహేందర్, భాజపా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్త నిక్కం, శివకుమార్, ప్రమోద్ రాక్రే, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ గుండావార్, భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ఉట్నూరు: ఉట్నూరులో విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఉట్నూరు, లక్కారం, దంతన్‌పల్లి, బిర్సాయిపేటలో సరఫరాలో ఉండదని ఏఈ శ్రావణ్ తెలిపారు.

మిషన్ భగీరథ నీరు రావడం లేదని నిరసన



కలెక్టరేట్ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కేఆర్కే కాలనీవాసులు

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : కేఆర్కే కాలనీలో వేసవి మాదిరి నీటి కటకట మొదలైంది. కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని కాలనీవాసులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. పాలనాధికారి స్పందించి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఆయాపార్టీల నాయకులు రాజు, సంతోష్, ముబారక్‌ల సారథ్యంలో కాలనీవాసులు ఈ నిరసన కొనసాగించారు.

సైబర్ నేరాలపై అవగాహన

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : వాట్సాప్ మాధ్యమాల్లో వచ్చే అప్లికేషన్ లింక్‌లను ఏమాత్రం ఓపెన్ చేయొద్దని, అలా చేస్తే సైబర్ నేరస్థుల చెరలో చిక్కి మోసపోతారని సైబర్ నేరవిభాగ డీఎస్పీ హసీబ్‌ఉల్లా పేర్కొన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.అతిక్‌బేగం, వైస్ ప్రిన్సిపల్ గణపతి రఘు, ఎన్‌సీసీ అధికారి చంద్రకాంత్, సిబ్బంది సంతోష్, అబ్దుల్ అహ్మద్ విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం చేద్దాం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : పోలీసు అమర వీరుల స్మారక వారోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 26న ఏఆర్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని యువజన సంఘాల సమితి నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఆ సమితి నాయకులు ఎస్పీ గౌష్ ఆలం, అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావును కలిసి పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. సమితి అధ్యక్షుడు బాలశంకర్ కృష్ణ, సమన్వయకర్త ఆదిత్య ఖండేష్కర్, రాణాప్రతాప్‌సింగ్, అర్ఫాత్ ఖాన్, బ్రహ్మారౌతు గణేష్‌వర్మ, సిరాజ్, తబ్రేజ్, సత్యం, పాలకొండ శ్రీకాంత్, ఆసిఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : తెలంగాణ పారామెడికల్ బోర్డు ఆదిలాబాద్ రిమ్స్‌కు డిప్లొమా ఇన్ ఆప్తాలమిక్ అసిస్టెంట్, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ కోర్సు సీట్లను 30 చొప్పున మంజూరు చేసిందని రిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాఠోడ్ జైసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల ఈ కోర్సుల్లో చేరటానికి ఆసక్తి ఉన్న ఇంటర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. సైన్స్ గ్రూప్ చదివిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యమివ్వనున్నట్లు తెలిపారు. 30 వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు www.tgpmb.telanganaimsadilabad.orgసందర్శించాలని, దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

సహకారం అందిస్తాం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : మహారాష్ట్రలో ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు కొనసాగిస్తూ సహకారం అందిస్తామని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌష్ ఆలం స్పష్టం చేశారు. మంగళవారం మహారాష్ట్రలోని యావత్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సరిహద్దు సమావేశంలో ఆ జిల్లా కలెక్టర్ పంకజ్ ఆశీయ, ఎస్పీ కుమార్ చింతా, ఆ రాష్ట్రంలోని ఇతర జిల్లాల అధికారులతో ఎస్పీ సమావేశమై చర్చించారు. సమావేశంలో ఆదిలాబాద్ స్పెషల్ బ్రాంచి డీఎస్పీ పోతారం శ్రీనివాస్, జైనథ్ ఎస్ఐ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



యావత్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్పీ గౌష్ ఆలం

సంక్షిప్త సమాచారం

భాజపా బలోపేతానికి కృషి

గుడిహత్నూర్: భాజపా బలోపేతానికి క్షేత్రస్థాయిలో కార్యకర్తలు కృషి చేయాలని భాజపా జిల్లా అధికార ప్రతినిధి లక్ష్మణ్ కెంద్రే అన్నారు. సూర్యగూడలో భాజపా సభ్యత్వ నమోదు చేపట్టారు. నాయకులు పరమేశ్వర్, గోపాల్, సుధాకర్, మారుతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా సోయా కొనుగోళ్ల నిలిపివేత

బోథ్: బోథ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో చేపట్టిన సోయా కొనుగోళ్లను 26 వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కేంద్రం సీఈవో గోలి స్వామి ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

పాలనాప్రాంగణం : హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి రెడ్‌రిబ్బన్ క్లబ్ పోటీల్లో ఆదిలాబాద్ పట్టణంలోని తెలంగాణ రెసిడెన్షియల్ గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థిని బి.సమీక్ష, తొమ్మిదో తరగతి విద్యార్థి ఎం.అక్షయ క్విజ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో మూడోస్థానంలో నిలిచారు. వారిని ప్రిన్సిపల్ లలితకుమారి అభినందించారు.

భువనేశ్వర్ కార్యశాలకు జిల్లావాసి

ఉట్నూరు గ్రామీణం: ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో ఆదివాసీల సంప్రదాయ వివాదాల పరిష్కారం అనే అంశంపై కార్యశాల మంగళవారం ప్రారంభమైంది. కార్యశాలకు రాష్ట్ర ఉన్నతాధికారులతో పాటు పెసా చట్టం జిల్లా కోఆర్డినేటర్ అర్క వసంత్‌రావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపంతో దుకాణానికి తాళం

ఆదిలాబాద్ అర్బన్: పట్టణంలోని భుక్తాపూర్(45వ వార్డు)లో ఆర్ఆర్ మాల్ దుకాణంలో సెప్టిక్ ట్యాంకు లీకేజీ ఏర్పడి చుట్టుపక్కల ఉన్న వారికి దుర్వాసన రావడంతో పుర కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్‌కు ఫిర్యాదు చేశారు. సెప్టిక్ ట్యాంకు లీకేజీ కాకుండా చర్యలు తీసుకోవాలని బల్దియా అధికారులు దుకాణ యజమానికి సూచించినా పట్టించుకోలేదు. శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్ అలీ ఆధ్వర్యంలో సిబ్బంది దుకాణానికి తాళం వేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నరేందర్, శంకర్, దారోగా పెంటన్న, సిబ్బంది ఉన్నారు.

ఆగిన ఆర్టీసీ బస్సు.. ప్రయాణికులకు తిప్పలు

ఆదిలాబాద్ గ్రామీణం: ఆదిలాబాద్ బస్టాండు నుంచి బయలుదేరిన అయిదు నిమిషాలకే కొద్ది దూరంలోనే ఆర్టీసీ బస్సు మరమ్మతులతో రోడ్డుపైనే ఆగిపోయింది. ప్రయాణికులు తిరిగి కాలినడకన అవస్థలు పడుతూ బస్టాండ్‌కు వెళ్లారు. నిజామాబాద్‌కు వెళ్లాల్సిన ఆదిలాబాద్ డిపోకు చెందిన బస్సు మంగళవారం మరమ్మతులతో ఒక్కసారిగా ఆగిపోయింది.

మహారాష్ట్ర సరిహద్దులో తనిఖీలు

బేల: మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దులోని పర్సవాడ వద్ద తనిఖీ కేంద్రం ఏర్పాటు చేశారు. రూ.50వేలకు పైగా నగదు ఉంటే వాటికి సంబంధించి పత్రాలు చూపించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

సొనాల(బోథ్): ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద మహారాష్ట్ర సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ ప్రాంతం నుంచి వెళ్లే వాహనాలను పరిశీలిస్తున్నారు. సిబ్బంది కైలాస్, నవ్‌నాథ్, సేవావే, ఎమ్.ఎన్.కాంబ్లే, కేంద్రె తదితరులు పాల్గొన్నారు.